క్లుప్తంగా

27న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

డిండి : ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి ఈనెల 27న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు స్థానిక ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆరో తరగతి విద్యార్థులకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, 7,8,9,10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2గంటల నుంచి 4గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మిగతా వివరాలకు 9490696989 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులకు జరిమానా

నిడమనూరు : భూ వివాదంలో బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులకు నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి స్వప్న జరిమానా విధించారు. పెద్దవూర మండలం తెప్పలమడుగు గ్రామానికి చెందిన వీరబోయిన వెంకన్న, వీరబోయిన లక్ష్మయ్య, వీరబోయిన రామలింగయ్యలు పొలం హద్దు విషయంలో వీరబోయిన వెంకటయ్యను బెదిరించారు. అప్పటి ఎస్‌ఐ అజ్మత్ అలీ ఆగస్టు 14, 2018లో కేసు నమోదు చేశారు. విచారించిన జడ్జి జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే ఒక నెల జైలు శిక్ష విధించాలని న్యాయమూర్తి స్వప్న శిక్షలు ఖరారు చేశారు. కేసులో పీపీ సాధన వాదనలు వినిపించారు. లైజన్ అధికారిగా అలీ అహ్మద్ వ్యవహరించారు.

నీటి సమస్య లేకుండా చూడాలి


అడవిదేవులపల్లిలో వీధులను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి

అడవిదేవులపల్లి : వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని అడవిదేవులపల్లి పంచాయతీ కార్యదర్శిని, జిల్లా పంచాయతీ అధికారి ఆదేశించారు. గురువారం అడవిదేవులపల్లి గ్రామంలో పర్యటించి ప్రధానంగా పారిశుద్ధ్య వ్యవస్థ, నర్సరీలు, వైకుంఠధామాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ మాతంగి రమేష్, ఎంపీవో ఎండి మోసిన్ బిన్ అహ్మద్, పంచాయితీ కార్యదర్శి దుర్గయ్య, రవికుమార్, ఉమామహేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టంపై శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎస్వీ గార్డెన్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ హరిబాబు తెలిపారు.ఈ సదస్సుకు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ హాజరై భూ భారతి చట్టం 2025పై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం భూ భారతి చట్టం -2025పై అవగాహన సదస్సును ఉదయం 7గంటలలకు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సదస్సుకు రైతులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

ఎంజీయూ వీసీని కలిసిన 'ఎంకేఆర్' బృందం


వీసీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధ్యాపకులు

దేవరకొండ : పట్టణంలోని ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి(అటానమస్) హోదా లభించిన సందర్భంగా కళాశాల బృందం గురువారం మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవిని కలిశారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు వారికి పుష్పగుచ్ఛం అందజేసి మాట్లాడారు. కళాశాల అభివృద్ధికి ముందు సహకారాలు అందించాలని వారిని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమావత్ రవి, అధ్యాపకులు జి.కోటయ్య, సీహెచ్ లింగమయ్య,సీహెచ్ లింగారెడ్డి, తదితరులు ఉన్నారు.

కరాటే క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

నల్లగొండ టూటౌన్: పట్టణంలోని పానగల్ రోడ్ అమూల్యకాలనీలో షావోలిన్ షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమ్మర్ కరాటే ఉచిత క్యాంపును గురువారం కాలనీ ప్రెసిడెంట్ అంబటి అంజయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ వేసవి కాలంలో ఏడు ప్రాంతాల్లో ఈ క్యాంపులు నెల రోజుల పాటు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు నాంపల్లి కనకారావు పాల్గొన్నారు.

లింక్ రోడ్లకు మోక్షమెప్పుడో!

- అధ్వానంగా రహదారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


అధ్వానంగా ఉన్న పూసలపాడు - కుక్కడం రోడ్డు


శిలాఫలకానికే పరిమితమైన పూసలపాడు- కుక్కడం రోడ్డు

మాడుగులపల్లి : పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు అని పెద్దలు చెబుతుంటారు. కాని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. మాడుగులపల్లి నుంచి పూసలపాడుకు వెళ్లే రహదారి మట్టిరోడ్డు కావడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి అధ్వానంగా ఉండడంతో మండల కేంద్రానికి విద్యార్థులు, గ్రామస్తులు, రైతులు ఈ రోడ్డు గుండానే వెళ్లాల్సి ఉండడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండాపోయిందని గ్రామస్తులు వాపోతున్నారు. అక్టోబర్ 2023 లో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీఆర్ఆర్ గ్రాంట్ కింద రూ.60లక్షల వ్యయంతో పూసలపాడు - కుక్కడం రహదారి మరమ్మతు చేపట్టేందుకు శిలాఫలకం ఏర్పాటు చేయగా ఇప్పటివరకు నిర్మాణానికి నోచుకోకపోవడంతో హామి శిలాఫలకానికే మారిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పూసలపాడు-కుక్కడం రోడ్డు సైతం గుంతలమయంగా కంకర తేలి ఉండడంతో ప్రయాణం నరకప్రాయంగా ఉందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ఈ రోడ్డు అధ్వాన్నంగా ఉండడంతో పూసలపాడు గ్రామస్తులు ఆయా పనుల నిమిత్తం గజలాపురం, కుక్కడం గ్రామాల నుంచి మండల కేంద్రానికి ప్రయాణిస్తున్నామని దీంతో దూర భారం పెరుగుతుందని వాపోతున్నారు. వెంటనే ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అధ్వానంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టి ఉన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టి ప్రయాణికుల ఇక్కట్లు తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కాలేజీకి చుట్టూ తిరిగి వెళ్లాల్సిందే



నేను మిర్యాలగూడ పట్టణంలో ఇంటర్ సెకండియర్ చేస్తున్నాను. రోజు మిర్యాలగూడకు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. పూసలపాడు నుంచి కుక్కడంకు వెళ్లాలంటే చుట్టు తిరిగి వెళ్లాలంటే 9కిలోమీటర్లు, పూసలపాడు నుంచి కుక్కడంకు వెళ్లాలంటే 5కిలోమీటర్లు. ప్రభుత్వ పూసలపాడు రోడ్డుకు మరమ్మతు చేస్తే మాకు టైం తగ్గుతుంది. ఇబ్బందులు లేకుండా కాలేజీకి వెళ్తాం.

– రొమ్ముల వేణు, పూసలపాడు

గుంతలతో ఇబ్బందులు పడుతున్నాం



ధాన్యాన్ని మిర్యాలగూడకు తీసుకెళ్లాలంటే పూసలపాడు రోడ్డు మోకాళ్లలోతు గుంతలతో ఉండడంతో ధాన్యం ఎక్కడ కింద పడిపోతుందోనని చుట్టు తిరిగి మిర్యాలగూడకు వెళ్తున్నాం. రెండు సంవత్సరాల క్రితం రోడ్డుకు మరమ్మతులు చేస్తామని ప్రభుత్వం చెప్పి ప్రజాప్రతినిధులు శిలాఫలకాలు పెట్టి కొబ్బరికాయలు కొట్టినా ఇప్పటివరకు జాడ లేదు. ఇప్పుడైనా ప్రభుత్వం చొరవ చూపి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి ఇబ్బందులు తొలగించాలి.

– రాంబాబు రైతు, పూసలపాడు

ప్రతిపాదనలు పంపించాం

గతంలో వచ్చిన సీఆర్ఆర్ ఫండ్‌ను క్యాన్సిల్ చేసి ప్రభుత్వానికి కొత్తగా ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే పనులను ప్రారంభిస్తాం.

– మధు, పంచాయతీరాజ్ ఏఈ

న్యాయవాదులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలి


సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సత్యనారాయణ, భూపతిరెడ్డి

మిర్యాలగగూడ టౌన్ : న్యాయవాదులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని, కార్పస్ ఫండ్‌ను రూ.500 కోట్లకు పెంచాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలూ) ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నేతి సత్యనారాయణ, అలుగుబెల్లి భూపతిరెడ్డి, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు మహ్మద్ ఇబ్రహీం, పట్టణ అధ్యక్షులు పూసపాటి పరమేష్‌లు ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు అంజయ్య, పవన్‌కుమార్, సాయి కుమార్ యాదవ్, రాయరపు భాస్కర్, సకినాల వేలాద్రి, రెడ్డిపల్లి సైదులు, గోదాల వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, గోదాల వెంకట్‌రెడ్డి సత్యనారాయణ, నాగేందర్, వెంకటేశ్వర్లు, నర్సింహారావు, నాగరాజు, కరుణాకర్, అంజయయ్య, రామనాయుడు, పుల్లారెడ్డి, నాగేందర్‌రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి


తిరుమలగిరి(సాగర్) : మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే భగత్

నిడమనూరు : బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కోరారు. గురువారం మండలంలోని వేంపాడు వద్ద ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సంక్షేమ పథకాలు కాంగ్రెస్ వైఫల్యాలను వివరించి పెద్ద సంఖ్యలో కార్యకర్తలను, ప్రజానీకాన్ని వరంగల్ సభకు వచ్చే విధంగా కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు తాటి సత్యపాల్, బొల్లం రవి, బైరెడ్డి సత్యనారాయణ రెడ్డి, చామల యాదగిరి రెడ్డి, పగిళ్ల సైదులు, మహిళా అధ్యక్షురాలు కళావతి పలువురు నాయకులు పాల్గొన్నారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ మండల స్థాయి నాయకుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ జెడ్పీటీసీ ఆంగోతు సూర్యాభాష్యానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు పిడిగం నాగయ్య, నాయకులు బానావత్ బాబురావునాయక్, శ్రీనివాస్‌రెడ్డి, రమణరాజు, బిక్షానాయక్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం


అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు

హాలియా : విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అవసరమని హెచ్ఎం దాస వెంకన్న అన్నారు. గురువారం మండలంలోని కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రులకు పాద పూజ అనే నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించుకోవాలని, క్రమ శిక్షణతో చదువుకుంటేనే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతుందన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం నిర్మల, మాధవి, దివ్యలక్ష్మి, ఓ నరిత గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా డ్రెయినేజీ వ్యవస్థ


పిల్ల కాలువలా ప్రవహిస్తున్న మురుగు నీరు

కొండమల్లేపల్లి : పట్టణ కేంద్రంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ముఖ్యంగా ప్రత్యేక అధికారుల పాలన తర్వాత ఈ పారిశుద్ధ్యం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని చెప్పవచ్చు. పట్టణ కేంద్రంలో ఎక్కడ చూసిన చెత్తా చెదారం, లీకేజీ అవుతూ బయటికి వస్తున్న డ్రెయినేజీ మురుగు నీరు. దీనికి తోడు మురుగు నీరు మొత్తం చిన్న పిల్ల కాలువ వలె ప్రవహిస్తున్న తీరు కాలనీవాసులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా గ్రామపంచాయతీ రోడ్డు నుంచి చింతచెట్టుతండాకు వెళ్లే మార్గంలో 8, 9 వార్డుల నుంచి వచ్చే మురుగు నీరు మొత్తం చిన్న పిల్ల కాలువల వలె తలపిస్తూ దుర్గంధం వెదజల్లుతూ ఇళ్ల మధ్య నుండి ప్రవహిస్తున్నాయి. ఈ వార్డులకు చెందిన ప్రజలు పలుమార్లు ఈ మురుగు నీరు వెళ్లడానికి శాశ్వత పరిష్కారం చేపట్టాలని గ్రామపంచాయతీ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికైన అధికారులు స్పందించి మురుగు నీరు వెళ్లడానికి శాశ్వత పరిష్కారం చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

టూరిస్టులపై ఉగ్రదాడులను ఖండిస్తూ ర్యాలీలు


చింతపల్లి : కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు


మిర్యాలగూడ అర్బన్ : కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న సీపీఎం నాయకుల


దేవరకొండ : విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

దేవరకొండ : కశ్మీర్‌లోని పహల్గాం యాత్రికులపై పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు జరిపిన దాడికి నిరసనగా గురువారం దేవరకొండ కోర్టు న్యాయవాదులు తమ విధులు బహిష్కరించి కోర్టు బయట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సన్నాయిల ఉమామహేష్, కర్నాటి సురేష్ మాట్లాడుతూ అభం శుభం తెలియని పర్యాటకులపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులను గుర్తించి వారిని ఎన్‌కౌంటర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు అశోక్‌గౌడ్, రమేష్, రాములు, శ్రీనివాస్, ముస్తాక్ అహ్మద్, యాదయ్య, జగదీశ్వర్, రవి, పుష్పలత, శ్రీకాంత్, ఆంజనేయులు, శంకర్, గణేష్, కృష్ణ, రాజశేఖర్, రాజ్‌కుమార్ ఉన్నారు.

చింతపల్లి : కశ్మీర్‌లోని పహల్గాంలో యాత్రికులపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపిన ఉగ్రవాదుల దిష్టిబొమ్మను గురువారం మండల కేంద్రంలో దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎర్ర వెంకటయ్య, చెన్నయ్య, జగన్, తులసి రత్న కుమారి, పుల్లారెడ్డి, అశోక్, నగేష్, రమేష్, ఆంజనేయులు, కృష్ణయ్య, చెన్నయ్య, ఏసు, యాదయ్య, పెద్దయ్య, మన్మథచారి, అగిరి రవి, నరేందర్, కిషోర్, కాషాయ్య, నల్ల కాషాయ్య, పున్న భీమేశ్వర్, జెల్ల రఘు, నల్ల శ్రీకాంత్, నల్ల సైదులు, గూడెల్లి కోటేష్,తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ప్రదర్శన

పెద్దవూర: కశ్మీర్ రాష్ట్రంలోని పహల్గాంలో టూరిస్టులపై ఉగ్రదాడికి నిరసనగా గురువారం రాత్రి మండల కేంద్రంలోని కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నడ్డి లింగయ్య, మిట్టపల్లి శ్రీనివాస్, పులిమాల కృష్ణారావు, రావుల సాయి, నరేష్, రావుల సంతు, సుమన్, నాగయ్య, చేతన్‌రెడ్డి, నడ్డి నాగరాజు, సయ్యద్ హుస్సేన్, శేఖర్, లక్ష్మీనారాయణ, నారాయణ, ప్రభాకర్, యాదగిరి పాల్గొన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

మిర్యాలగూడ అర్బన్ : కశ్మీర్ పర్యాటకులపై ఉగ్రదాడులు చేయడం అమానుషమని దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అంజాద్ అన్నారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమాయకులైన టూరిస్టులపై కాల్పులు జరిపి శాంతియుత కశ్మీర్‌లో అలజడి సృష్టించారని, ఉగ్రవాద దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడులపై సమగ్ర విచారణ జరిపి దోషులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అవాజ్ నాయకులు అయూబ్, కరిమున్నీషాబేగం, సమద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

కశ్మీర్‌లో ఉగ్రదాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అన్నారు. గురువారం రాత్రి సీపీఎం ఆధ్వర్యంలో ఉగ్రదాడులను నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు అయూబ్, గుణగంటి రాంచంద్రు, వేణు, వల్లపుదాసు మాదవరావు తదిరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్

నల్లగొండ టూటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యారంగాన్ని పూర్తి నిర్లక్ష్యం చేసిందని, ఇంటర్‌లో వెలువడిన ఫలితాలు అందుకు సాక్షమని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున ముదిరాజ్ అన్నారు. గురువారం స్థానిక ఎన్జీ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులను, నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రైవేట్ కాలేజీలకు ఇంటర్ ఫలితాల్లో మొదటి స్థానం వచ్చిందని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాంగ్రెస్ విస్మరించిందని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసి మెరుగైన విద్య అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్వీ నాయకులు నోముల క్రాంతికుమార్, ప్రేమ్‌కుమార్, మండలి మహేష్‌రెడ్డి, శివకుమార్, హరిశంకర్ పాల్గొన్నారు.

మే డేను విజయవంతం చేయాలి


కొండమల్లేపల్లి : పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కొండమల్లేపల్లి : ప్రపంచ కార్మిక దినోత్సవం (మేడే) ను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి కోరారు. ఈ మేరకు కొండమల్లేపల్లి మార్కెట్‌యార్డు వద్ద గురువారం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు కోడులుగా చేసి కార్మికులకు అన్యాయం చేసిందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు అలమోని, మల్లయ్య, బాలు, బోడ శ్రీను, శంకర్, సోమ్లా తదితరులు పాల్గొన్నారు.

మేడే పోస్టర్ ఆవిష్కరణ

డిండి : మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మేడే జెండాను ఎగురవేసి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సాయిలు, దేవయ్య, జోహర్‌లాల్, ఇదమ్మ, గంగమ్మ, బాలమ్మ, సాలమ్మ, సైదమ్మ , చెన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పితే ప్రమాదమే


రోడ్డు వెంట ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

పెద్దవూర : మండలంలోని గర్నెకుంట-పెద్దవూర ప్రధాన రహదారిపై మండల కేంద్రం సమీపంలో పెద్దవాగుపై గల వంతెన వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను రోడ్డును ఆనుకుని ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన ప్రదేశంలో రోడ్డుకు రెండు వైపులా మూలమలుపులు ఉన్నాయి. మండల కేంద్రం నుంచి మండలంలోని గర్నెకుంట, వెలమ్మగూడెం, కటికర్లగూడెం, బసిరెడ్డిపల్లితో పాటు గుర్రంపోడు మండలంలోని పలు గ్రామాలకు ఈ రోడ్డు మార్గం గుండానే వాహనదారులు వెళ్తుంటారు. రోడ్డుకు రెండు వైపులా మూలమలుపులు ఉండటంతో దగ్గరకు వచ్చేదాకా వాహనదారులకు ట్రాన్స్‌ఫార్మర్ కనిపించదు. దీనికి తోడు ఎలాంటి రక్షణ గోడలు గాని, తీగలను గాని ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనం ఏమాత్రం అదుపు తప్పినా నేరుగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొట్టాల్సిందే. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, ప్రయాణికులు భయాందోళనకు గురి అవుతున్నారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోక పోవడంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు కంపచెట్లను, పెద్ద బండరాయిని ట్రాన్స్‌ఫార్మర్ పక్కన వేశారు. అధికారులు స్పందించి రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి రోడ్డుకు దూరంలో ఏర్పాటు చేసి చుట్టూ రక్షణను కల్పించాలని కోరుతున్నారు.

అమరుల ఆశయాలను సాధించాలి


అమరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : అమరుల ఆశయాలను సాధించాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య అన్నారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన అమరజీవుల వారోత్సవాల సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో ప్రతి కార్యకర్త ఎర్రజెండా ఎత్తుకొని ముందుకు సాగాలని అమరుల త్యాగాలను స్మరించుకుంటూ ఉద్యమ నిర్మాణాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వస్కుల సైదమ్మ, మోహన్‌లాల్, కిరణ్, జ్యోతి, సైదులు, పవన్, మల్లేష్, శ్రీను, సత్యం, ఇమ్మానియల్, అభి, రమణ, మౌనిక, లక్కి, ఆశీర్వాదం, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

28న పూలే, అంబేడ్కర్ జన జాతర


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండలో 28న నిర్వహించనున్న పూలే, అంబేడ్కర్ జన జాతరలో పాల్గొనాలని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మంద నగేష్, ఉపాధ్యక్షుడు శేఖర్ కోరారు. గురువారం జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాల్‌లో కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, సీనియర్ న్యాయవాదులు అనంతల శంకరయ్య, దర్శనం నరసింహ, మోహన్ రెడ్డి, మల్లేపల్లి ఆదిరెడ్డి పందుల సైదులు గౌడ్, రమేష్, మామిడి ప్రమీల, మోర ప్రవీణ్ కుమార్, స్వామినాథ, నాగరాజు, శివాజీ, యాదగిరి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్లపైనే పార్కింగ్

- దేవరకొండలో తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్య
- పార్కింగ్ స్థలాలు కేటాయించాలని కోరుతున్న వాహనదారులు


విష్ణు కాంప్లెక్స్ సమీపంలో రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలు

దేవరకొండ : దేవరకొండ పట్టణం మున్సిపాలిటీగా ఏర్పాటయ్యాక వ్యాపార, వాణిజ్యపరంగా రోజురోజుకు దినదినాభివృద్ధి చెందుతుంది. దీంతో దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాలు, గ్రామాలకు చెందిన ఎంతో మంది ప్రజలు నిత్యం వివిధ పనుల నిమిత్తం పట్టణానికి రోజూ రాకపోకలు కొనసాగిస్తుంటారు. ఇదిలా ఉంటే ఆయా వాణిజ్య సముదాయాల వద్ద వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేకంగా స్థలాలు కరువవ్వడంతో వాహనదారులు తమ వాహనాలను ఇష్టానుసారంగా దుకాణాల ఎదుట రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు.దీంతో పాదచారులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తరుచూ ఇబ్బందులు

పట్టణంలో పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు తలెత్తినప్పుడల్లా మున్సిపల్, పోలీసు అధికారులు హడావుడి చేయడం సర్వసాధారణమైపోయింది. పట్టణంలోని ఆయా వాణిజ్య సముదాయాల వద్ద పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో కాలినడకన వెళ్లే వారు సైతం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రధానంగా పట్టణంలోని బస్టాండు, రహదారి బంగ్లా, విష్ణు కాంప్లెక్స్, చేనేత సహకార సంఘం, డిండి ఎక్స్‌రోడ్డు వంటి ప్రధాన ప్రాంతాల్లో వాహనాలను వాహనదారులు ఇష్టారాజ్యంగా నిలుపుతుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. దీంతో కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను రోడ్లపై నిలిపే క్రమంలో పోలీసులు ఆన్‌లైన్ ద్వారా చాలానాలు విధిస్తుండడంతో వాహనదారులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. కాగా ఇప్పటికై న పట్టణ పరిధిలోని ఆయా ప్రధాన వ్యాపార,వాణిజ్య సముదాయాల వద్ద వాహనాలకు అవసరమైన పార్కింగ్ స్థలాలను కేటాయించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి



దేవరకొండ పట్టణానికి వివిధ పనుల నిమిత్తం చుట్టు పక్కల నుంచి వచ్చే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.అందుకు అనుగుణంగానే వాహనాల రద్దీ సైతం పెరుగుతుంది. దీంతో పట్టణంలో కొంత మేర ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. ప్రత్యేకంగా పట్టణంలోని ఆయా రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.వాహనదారులు, పట్టణ ప్రజలు ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పోలీసులకు సహకరించాలి. రోడ్లపై పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకుంటాం.

నర్సింహులు, సీఐ, దేవరకొండ